రోజుకు 24 గంటలు కాదు!

- గ్లోబల్ వార్మింగ్‌తో తగ్గిపోతున్న భూభ్రమణ వేగం
- ఫలితంగా 24 గంటల బదులు పెరగనున్న వ్యవధి

(స్పెషల్ టాస్క్ బ్యూరో) హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): రోజుకు 24 గంటలు అని చిన్నప్పుడు స్కూల్‌లో చదువుకొన్నాం. అయితే, రానున్న రోజుల్లో రోజు అంటే 24 కంటే ఎక్కువ గంటలు ఉండే అవకాశ మున్నదని శాస్త్రవేత్తల తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. భూతాపం, వాతావరణ మార్పుల కారణంగా గ్రీన్‌లాండ్, ఆర్కిటిక్, అంటార్కిటిక్ తదితర ధ్రువప్రాంతాల్లో పెద్దయెత్తున మంచు కరిగిపోతున్నది. ఇది ఇలాగే కొనసాగితే, సముద్రాల్లో నీటి మట్టాలు పెరిగిపోతాయి. భూభాగం క్రమంగా తగ్గిపోతుంది. ఇది సముద్రాలపై పడే చంద్రుడి గురుత్వాకర్షణపై, భూ గురుత్వాకర్షణ శక్తిపై ప్రభావాన్ని చూపించి భూభ్రమణ వేగాన్ని నెమ్మదించేలా చేయవచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇదే జరిగితే తొలుత 24 గంటలు ఉన్న రోజు వ్యవధి మిల్లీ సెకండ్ల మేర పెరుగుతుందని, ఆ తర్వాత ఈ వ్యవధి మరింత పెరుగొచ్చని హెచ్చరిస్తున్నారు. గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడమే దీనికి పరిష్కారంగా సూచిస్తున్నారు. స్విట్జర్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిక్ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని చేపట్టారు.

ప్రభావం వేటిమీద ఉండొచ్చు?

రోజు వ్యవధి పెరుగడంతో మిల్లీసెకండ్ల కచ్చితత్వంతో పనిచేసే ఇంటర్నెట్ ట్రాఫిక్, ఆర్థిక లావాదేవీలు, నావిగేషన్, రాకెట్ ప్రయోగాలు, శాటిలైట్ ప్రసారాలు ఇలా సాంకేతికంగా అన్ని ప్రధాన రంగాలపై పెను ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రోబో డ్రైవర్!

టోక్యో, జూలై 16: డ్రైవర్‌లెస్ వాహనాలపై ఇప్పటికే చాలా కంపెనీలు పరిశోధనలు తీవ్రం చేసిన నేపథ్యంలో జపాన్‌కు చెందిన పరిశోధకులు మరో అడుగు ముందుకు వేశారు. సాధారణ మనిషిలాగే కారు డ్రైవ్ చేసే రోబోను అభివృద్ధి చేశారు. ముసాషి అని నామకరణం చేసిన ఈ రోబో డ్రైవర్.. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న కార్లనే డ్రైవ్ చేస్తుందని యూనివర్సిటీ ఆఫ్ టోక్యో పరిశోధకులు తెలిపారు. హ్యాండ్ బ్రేక్ వాడటం, ఇగ్నిషన్ కీ ఆన్ చేయటం, పెడల్స్ తొక్కడం, స్టీరింగ్ తిప్పడం, ఇండికేటర్లు వాడటం లాంటి పనులు కూడా చేస్తుందని వెల్లడించారు. రోబో కళ్లలో హై రిజల్యూషన్ కెమెరాలు ఉంటాయని, వీటిని ఏఐ సిస్టమ్స్‌కు అనుసంధానం చేసినట్టు వివరించారు. ప్రస్తుతానికి ఈ రోబో గంటలకు 3 మైళ్ల వేగంతో ముందుకు, కుడి వైపు మాత్రమే చూసి నడపగలదని, త్వరలోనే సాధారణ మనిషిలా డ్రైవ్ చేసేలా శిక్షణ ఇస్తామని పరిశోధకులు పేర్కొన్నారు.

అమెరికా ఉపాధ్యక్ష రేసులో తెలుగింటి అల్లుడు

- రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా జేడీ వాన్స్
- ఆయన భార్య ఉషా చిలుకూరి
- జేడీ వాన్స్‌తో ఉషా ప్రేమ వివాహం
- ఆమెది అమెరికాలోని తెలుగు కుటుంబం
- అధ్యక్ష అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్
- ఇద్దరి పేర్లు అధికారికంగా ప్రకటన

రిపబ్లికన్ పార్టీ జాతీయ సదస్సులో భార్యతో కలిసి నవ్వులు చిందిస్తున్న వాన్స్.. చెవికి బ్యాండేజీతో ట్రంప్ (ఇన్‌సెట్‌లో)

మిల్వాకీ, జూలై 16: అగ్రరాజ్యం అమెరికా ఉపాధ్యక్ష పదవికి తెలుగింటి అల్లుడు పోటీ పడనున్నారు. రిపబ్లికన్ పార్టీ తరపున ఉపాధ్యక్ష అభ్యర్థిగా జేమ్స్ డేవిడ్ వాన్స్(39) పేరు ఖరారయ్యింది. ఎన్నికల బరిలో తనతో పాటు పోరాడే సహచరుడిగా వాన్స్‌ను డొనాల్డ్ ట్రంప్ ఎంపిక చేసుకున్నారు. ప్రస్తుతం ఓహియో సెనేటర్‌గా జేడీ వాన్స్ ఉన్నారు. వాన్స్ సతీమణి ఉషా చిలుకూరికి భారతీయ మూలాలు ఉండటం విశేషం. అమెరికాలో స్థిరపడిన ఏరోస్పేస్ ఇంజినీర్ రాధాకృష్ణ చిలుకూరి, ప్రొఫెసర్ లక్ష్మి చిలుకూరి కూతురు ఉషా. కాలిఫోర్నియాలోని శాన్ డియాగోలో పుట్టి పెరిగిన ఉషా చిలుకూరి.. వృత్తిరీత్యా న్యాయవాది. ఆమె గతంలో అమెరికా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు క్లర్క్‌గా కూడా పని చేశారు. యేల్ లా స్కూల్‌లో ఉషా, వాన్స్ కలిసి న్యాయవిద్యను అభ్యసించారు. ఈ సమయంలోనే వీరిద్దరి మధ్య ప్రేమ ఏర్పడి వివాహానికి దారి తీసింది. 2014లో కెంటకీలో వీరి వివాహం హిందూ, క్రైస్తవ సంప్రదాయాల్లో జరిగింది. వీరికి ఎవాన్(6), వివేక్(4), మీరాబెల్(2) పిల్లలు ఉన్నారు.

విమర్శకుడే సహచరుడు

ఉపాధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ తరపున అభ్యర్థిగా వాన్స్ అనూహ్యంగా తెరపైకి వచ్చారు. వ్యాపారవేత్త అయిన వాన్స్ 2022లో ఓహియో నుంచి యూఎస్ సెనేట్‌కు ఎంపికయ్యారు. ఆయన రాసిన 'హిల్‌బిల్లీ ఎలెగీ' అనే పుస్తకం విశేషాదరణ పొందింది. ఈ పుస్తకం ఆధారంగా ఒక సినిమా కూడా తెరకెక్కింది. అనేక ఆలోచనలు, సంప్రదింపుల తర్వాత అమెరికా ఉపాధ్యక్ష పదవిని చేపట్టేందుకు వాన్స్ సరైన వ్యక్తి అని తాను భావించినట్టు ట్రంప్ ప్రకటించారు. అయితే, గతంలో ట్రంప్‌ను వాన్స్ తీవ్రంగా విమర్శించిన సందర్భాలు ఉన్నాయి. ఒకసారి ట్రంప్‌ను 'అమెరికా హిట్లర్' అని సైతం వాన్స్ విమర్శించారు. తర్వాతి కాలంలో ట్రంప్‌కు వాన్స్ నమ్మకస్తుడిగా మారారు. కాగా, తాను ఈ స్థాయిలో ఉండటానికి తన భార్య ఉషా మద్దతు కూడా ప్రధాన కారణమని ఓ ఇంటర్వ్యూలో వాన్స్ పేర్కొన్నారు. తనకు మార్గదర్శిగా నిలిచిన శక్తివంతమైన మహిళా గళం ఆమెదని చెప్పారు.

ట్రంప్ కోసం మస్క్ భారీ విరాళం..
ప్రతి నెల రూ.376 కోట్లు

న్యూయార్క్, జూలై 16: అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ తరపున పోటీ చేస్తున్న డొనాల్డ్ ట్రంప్‌నకు టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ బలమైన మద్దతుదారుగా నిలుస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించిన మస్క్.. ఇప్పుడు ట్రంప్ కోసం భారీ విరాళం ఇవ్వాలని నిర్ణయించినట్టు వాల్ స్ట్రీట్ జర్నల్ ఒక కథనం ప్రచురించింది. ట్రంప్ కోసం పని చేస్తున్న 'అమెరికా పీఏసీ' అనే సంస్థకు మస్క్ నెలకు 45 మిలియన్ డాలర్ల(రూ.376 కోట్లు) విరాళం ఇవ్వనున్నట్టు ఈ కథనం పేర్కొన్నది.

మూడోసారి బరిలో ట్రంప్

అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు ట్రంప్ పేరు అధికారికంగా ఖరారైంది. మిల్వాకీలో జరుగుతున్న రిపబ్లికన్ పార్టీ జాతీయ సమావేశంలో పార్టీ ప్రతినిధులు ట్రంప్ అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపారు. దీంతో నవంబరులో జరగనున్న అగ్రరాజ్య అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ మరోసారి బరిలో నిలవడం ఖాయమైంది. రిపబ్లికన్ పార్టీ తరపున ట్రంప్ మూడోసారి అధ్యక్ష బరిలో నిలుస్తున్నారు. ఆయన 2016లో మొదటిసారి అధ్యక్ష బరిలో నిలిచి విజయం సాధించారు. 2020లో ఆయన మరోసారి పోటీ చేసి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ చేతిలో ఓటమి చవిచూశారు. ఇప్పుడు మరోసారి ట్రంప్ అధ్యక్ష రేసులో నిలిచారు. 'మేక్ అమెరికా గ్రేట్ వన్స్ అగైన్(అమెరికాను మరోసారి గొప్పగా మార్చండి)' అనే నినాదంతో ఆయన ప్రజల్లోకి వెళ్తున్నారు. తాజాగా ట్రంప్‌పై హత్యాయత్నం ఘటన నేపథ్యంలో అమెరికా ప్రజల్లో ఆయన మీద సానుభూతి నెలకొన్నది.

ట్రంక్ పెట్టె నుంచి నీట్ పేపర్ కాజేశాడు

లీకేజీ కేసులో కీలక నిందితుడి అరెస్ట్

న్యూఢిల్లీ, జూలై 16: జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ట్రంక్ పెట్టె నుంచి నీట్-యూజీ పేపర్ కాజేసిన కీలక నిందితుడిని సీబీఐ అరెస్ట్ చేసింది. అతడితో పాటు అతడికి సహకరించిన రాజు సింగ్‌ను హజారీబాగ్‌లో అదుపులోనికి తీసుకున్నట్టు దర్యాప్తు సంస్థ మంగళవారం వెల్లడించింది. వీరిద్దరి అరెస్ట్‌తో నీట్ లీకేజీ, అక్రమాల కేసులో అరెస్టయిన నిందితుల సంఖ్య 14కి పెరిగింది. నీట్ పేపర్ కాజేసిన పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య జంషెడ్‌పూర్ ఎన్ఐటీలో 2017లో సివిల్ ఇంజినీరింగ్ చదివారని సీబీఐ అధికారులు తెలిపారు. బొకారోలో నివసించే అతడిని పాట్నాలో అరెస్ట్ చేశామని వెల్లడించారు.

భారతీయ భాషల్లో 22వేల పుస్తకాలు

యూజీసీ ప్రాజెక్ట్ 'అస్మిత' ప్రారంభం

న్యూఢిల్లీ, జూలై 16: రాబోయే ఐదేండ్లలో భారతీయ భాషల్లో 22 వేల పుస్తకాల్ని తీసుకొచ్చేందుకు యూజీసీ, కేంద్ర విద్యాశాఖ సంయుక్తంగా ఓ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాయి. అనువాదం, అకడమిక్ రైటింగ్ ద్వారా భారతీయ భాషల్లో ఉన్నత విద్యకు సంబంధించిన స్టడీ మెటీరియల్స్‌ను తీసుకురావటమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ చెప్పారు. ప్రతి భాషలో 1000 పుస్తకాల్ని రూపొందిస్తూ, ఐదేండ్లలో మొత్తం 22 భాషల్లో 22 వేల పుస్తకాలు తీసుకొస్తామని అన్నారు. కేంద్ర కార్యదర్శి సంజయ్ మూర్తి చేతులమీదుగా ప్రాజెక్ట్ 'అస్మిత' (అగ్‌మెంటింగ్ స్టడీ మెటీరియల్స్ ఇన్ ఇండియన్ లాంగ్వేజెస్ థ్రూ ట్రాన్స్‌లేషన్, అకడమిక్ రైటింగ్)ను ప్రారంభించినట్టు ఆయన చెప్పారు.

PM CARES
Prime Minister's Citizen Assistance and Relief in Emergency Situations Fund

సగం మంది అనాథలకు 'పీఎం కేర్స్' తిరస్కరణ

న్యూఢిల్లీ: పీఎం కేర్స్ పథకం సాయం కోసం అనాథ పిల్లలు చేసుకున్న దరఖాస్తుల్లో 51 శాతం తిరస్కరణకు గురైనట్టు అధికారులు తెలిపారు. కొవిడ్ ఉధృతి ఎక్కువగా ఉన్న సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. కరోనా కారణంగా మార్చి 11, 2020 – మే 5, 2023 మధ్య కాలంలో తల్లి దండ్రులు, చట్టబద్ధ సంరక్షకులు, దత్తత తల్లిదండ్రులు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరిని కోల్పోయిన చిన్నారుల జీవనానికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని తెచ్చారు. అధికారిక లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా సాయం కోరుతూ 9,331 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 4,532 దరఖాస్తులను ఆమోదించారు. 18 అప్లికేషన్లను పెండింగ్‌లో ఉంచారు. తిరస్కరించిన దరఖాస్తులకు అందుకు గల నిర్దిష్ట కారణాలేమిటో తెలుపలేదు.

సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జీలు

తొలిసారిగా మణిపూర్ వాసికి స్థానం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో తాజాగా ఇద్దరు జడ్జీలు నియమితులయ్యారు. దీంతో సుప్రీం కోర్టులో చీఫ్ జస్టిస్‌తో కలిపి న్యాయమూర్తుల సంఖ్య 34కు చేరి పూర్తి సామర్థ్యంతో కొలువుదీరింది. ఈ నెల 11న సీజేఐ నేతృత్వంలోని కొలీజియం సుప్రీంకోర్టు జడ్జీలుగా మణిపూర్‌కు చెందిన ఎన్ కోటిశ్వర్ సింగ్, తమిళనాడుకు చెందిన మహదేవన్‌ల పేర్లను సిఫారసు చేయగా, కేంద్రం తాజాగా ఆమోదం తెలిపింది. దీంతో తొలిసారిగా ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌కు చెందిన వ్యక్తి సుప్రీంకోర్టు జడ్జి అయ్యారు. ప్రస్తుతం సింగ్ జమ్ము కశ్మీర్, లఢక్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉన్నారు. అలాగే మహదేవన్ మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా వ్యవహరిస్తున్నారు.

కర్ణాటక ఉద్యోగులకు 27.5% ఫిట్‌మెంట్

బెంగళూరు, జూలై 16: కర్ణాటక ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం ప్రకటించారు. వేతన పెంపు ఆగస్టు 1 నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. వేతనాలు పెంచకపోతే ఆగస్టులో నిరవధిక సమ్మెకు దిగుతామని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రకటించిన నేపథ్యంలో సిద్ధరామయ్య ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. దీంతో 7వ వేతన సవరణ కమిషన్ సిఫార్సుల మేరకు 2022 జూలై 1 నాటికి ఉద్యోగులు అందుకున్న బేసిక్‌పై 27.5 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రభుత్వం ప్రకటించింది. డీఏను 31 శాతం, హెచ్ఆర్ఏను 32 శాతం పెంచింది.

నలుగురు జవాన్ల వీరమరణం

- జమ్ముకశ్మీర్‌లోని దోడాలో ఎదురుకాల్పులు
- మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జవాన్ రాజేశ్
- దాడి తమ పనేనన్న 'ది కశ్మీర్ టైగర్స్' ఉగ్ర సంస్థ
- జమ్ములో 32 నెలల్లో 48 మంది సైనికుల మృతి

బ్రిజేశ్ థాపా | డీ రాజేశ్ | బిజేంద్ర | అజయ్ కుమార్

జమ్ము/కోల్‌కతా/న్యూఢిల్లీ, జూలై 16: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు పెట్రేగిపోతున్నారు. తాజాగా దోడాజిల్లాలో భద్రతా బలగాలు సోమవారం చేపట్టిన ఎన్‌కౌంటర్ సందర్భంగా ఉగ్రవాదుల ఎదురు కాల్పుల్లో ఒక ఆఫీసర్‌తో సహా నలుగురు సైనికులు వీరమరణం పొందారు. మరణించిన వాళ్లలో డార్జిలింగ్‌కు చెందిన కెప్టెన్ బ్రిజేశ్ థాపా, ఏపీకి చెందిన నాయక్ డీ రాజేశ్, రాజస్థాన్‌కు చెందిన సిపాయిలు బిజేంద్ర, అజయ్ కుమార్ సింగ్ ఉన్నారని ఆర్మీ అధికారులు మంగళవారం వెల్లడించారు. దాడి తామే చేశామని పాక్ కేంద్రంగా పనిచేసే జైషే మహ్మద్ సంస్థకు షాడో గ్రూపు 'ది కశ్మీర్ టైగర్స్' ప్రకటించింది. ఉగ్రవాదులు దోడా జిల్లాలోని దేసా ఏరియా అడవుల్లో దాగి ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు సోమవారం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో రాత్రి 9 గంటల సమయంలో తారసపడిన టెర్రరిస్టులకు ఎదురు కాల్పులకు పాల్పడ్డారని ఆర్మీ 16 కార్ప్స్ ఎక్స్ పోస్టులో వెల్లడించింది. ఐదుగురు సైనికులు తీవ్రంగా గాయపడగా, వీరిలో నలుగురు మరణించారని అధికారులు తెలిపారు. జమ్ము రీజియన్‌లో గత 32 నెలల వ్యవధిలో ఉగ్రదాడుల్లో 48 మంది ఆర్మీ జవాన్లు మరణించారు.

మరో దాడిలో ఏపీ జవాన్ మృతి

జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో సోమవారం ఉగ్రవాదుల దాడిలో ఏపీలోని శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం వల్లభరాయుడు పేట గ్రామానికి చెందిన హవిల్దార్ ఎస్ జగదీశ్వర్ రావు మరణించారు. జగదీశ్వర్‌రావు 11 రాష్ట్రీయ రైఫిల్స్‌లో భాగంగా 2003లో ఆర్మీలో చేరారు.

కొద్ది రోజులుగా పెరిగిన ఉగ్రదాడులు

గత కొన్నేండ్లుగా ప్రశాంతంగా ఉన్న జమ్ము రీజియన్‌లో గత నెల రోజులుగా ఉగ్రదాడులు పెరుగుతున్నాయి. జమ్ము రీజియన్‌లో 2021 నుంచి 52 మంది భద్రతా సిబ్బంది సహా 70 మంది మరణించారు.కాగా, విదేశీ ఉగ్రవాదులను అంతమొంతించేందుకు జమ్ముకశ్మీర్ పోలీసులతో కలిసి సంయుక్త ఆపరేషన్లు చేపడుతున్నట్టు ఆర్మీ తెలిపింది.

బీజేపీ తప్పుడు విధానాల కారణంగా..

కేంద్రంలోని అధికార బీజేపీ తప్పుడు విధానాల కారణంగా ఆర్మీ జవాన్లు, వారి కుటుంబాలు బలవుతున్నాయని విపక్షాలు విమర్శించాయి. దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. డీజీపీని తొలగించాలని పీడీపీ చీఫ్ ముఫ్తీ కోరగా, ఉగ్రవాదాన్ని నియంత్రించడంలో మోదీ విఫలమయ్యారని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు.

నా కుమారుడి పట్ల గర్వంగా ఉంది

దేశం కోసం తన కుమారుడు ప్రాణాలు అర్పించడం గర్వంగా ఉన్నదని దోడా ఉగ్రదాడిలో మరణించిన ఆర్మీ కెప్టెన్ బ్రిజేశ్ థాపా తండ్రి భువనేశ్ కే థాపా అన్నారు. తన కుమారుడు దేశంలో ఆర్మీ డే జరుపుకొనే జనవరి 15న జన్మించాడని తెలిపారు. భువనేశ్ కూడా ఆర్మీలో కర్నల్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. తన కుమారుడు తనను చూసి స్ఫూర్తి పొందాడని, సైన్యంలో చేరాలని చిన్నప్పటి నుంచే కలలు కన్నాడని పేర్కొన్నారు. 'నా కుమారుడిని చూసి నాకు గర్వంగా ఉన్నది' అని ఆ రిటైర్డ్ ఆర్మీ అధికారి ఉద్వేగంతో అన్నారు. ఆర్మీ ఆపరేషన్లలో చాలా రిస్క్ ఉంటుందని, రిస్క్ ఎలా ఉన్నప్పటికీ జవాన్ నిబద్ధతతో పనిచేయాల్సి ఉంటుందని భువనేశ్ పేర్కొన్నారు.

కేదార్‌నాథుడు ఒక్కడే!

ఢిల్లీలో మరో గుడి నిర్మాణం వద్దు
దేశంలోని పీఠాధిపతుల డిమాండ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో) హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): జ్యోతిర్లింగ క్షేత్రం కేదార్‌నాథ్‌ను పోలిన మరో ఆలయాన్ని ఢిల్లీలో నిర్మించాలనుకొన్న ఉత్తరాఖండ్ బీజేపీ సర్కారు నిర్ణయాన్ని దేశంలోని పీఠాధిపతులు, ప్రధాన ఆలయ పూజారులు, ఆధ్యాత్మికవేత్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. హిమాలయాల్లోని కేదార్‌నాథ్ ఆలయమే నిజమైనదని, ఇప్పుడు మరో ఆలయాన్ని ఢిల్లీలో నిర్మించడమేంటని జ్యోతిర్మఠ్ శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద ప్రశ్నించారు. కేదార్‌నాథ్ పేరిట మరో ఆలయాన్ని నిర్మించడం సరైనది అయోధ్య రామాలయం ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ అభిప్రాయపడ్డారు. కేదార్‌నాథుడు ఒక్కడేనని, ఢిల్లీలో నిర్మించే ఆలయం.. 12 జ్యోతిర్లింగాల్లో ఎన్నటికీ కలువబోదని తేల్చిచెప్పారు. ఆలయ నిర్మాణంపై పునరాలోచన చేయాలని, లేదా గుడి పేరు మార్చాలని ప్రభుత్వానికి సూచించారు.

ఎస్సీ కులాల జాబితాను మార్చే
అధికారం రాష్ట్రానికి లేదు

- పార్లమెంటులో చట్టం ద్వారానే మార్చాలి
- సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు

న్యూఢిల్లీ, జూలై 16: షెడ్యూల్డ్ కులాల జాబితాలో మార్పులు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదని సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీహార్‌లో ఈబీసీ జాబితా నుంచి 'తంతి-తంత్వ' సామాజికవర్గాన్ని తొలగించి, షెడ్యూల్డ్ కులాల జాబితాలో ఉన్న 'సావాసి'లో కలుపుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వం 2015లో ఇచ్చిన నోటిఫికేషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341లో ప్రచురించిన షెడ్యూల్డ్ కులాల జాబితాలో మార్పులు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. క్లాజ్-1లో పొందుపరిచిన ఎస్సీ కులాల జాబితాను పార్లమెంటులో చట్టం ద్వారానే మార్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నది. ఆర్టికల్ 341 ప్రకారం.. పార్లమెంటులో చట్టం చేయకుండా ఈ జాబితాలో మార్పులు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతికి కూడా ఉండదని ధర్మాసనం తెలిపింది.

తాళాల మిస్సింగ్ వెనుక ఏదో జరిగింది!

- జగన్నాథుడి ప్రధాన అర్చకుడు మహాపాత్ర అనుమానం
- నిజం బయటకు రావాలంటే దర్యాప్తు జరగాలని డిమాండ్

భువనేశ్వర్: ఒడిశాలోని పూరీ జగన్నాథుడి ఆలయ రత్న భాండాగారం తాళం చెవిల మిస్సింగ్ వ్యవహారం ఇప్పుడు పెద్ద దుమారం రేపుతున్నది. తాళాల అదృశ్యం వెనుక ఏదో జరిగిందంటూ ఆలయ ప్రధాన పూజారి జగన్నాథ్ మహాపాత్ర అనుమానాలు వ్యక్తం చేశారు. తాళాల మిస్సింగ్, తర్వాత డూప్లికేట్ తాళాలను గుర్తించినట్టు చెప్పడంపై ఇప్పటికే గందరగోళం నెలకొన్న నేపథ్యంతో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకొన్నది. రత్న భాండాగారం తాళాలు కనిపించకుండా పోవడం, డూప్లికేట్ తాళాలు తెరవైకి రావడం సిగ్గుచేటని మహాపాత్ర అన్నారు. ఈ డూప్లికేట్ తాళాల చెవులు రత్న భాండాగారం ఇన్నర్ చాంబర్‌లోని తాళాలకు సరిపోలేదని పేర్కొన్నారు. 'దీన్నిబట్టి చూస్తే ఏదో జరిగినట్టు అనిపిస్తుంది. నిజం బయటకు రావాలంటే దర్యాప్తు జరగాలి' అని ఆయన అభిప్రాయపడ్డారు. విలువైన వస్తువులు ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని భాండాగారం పెట్టెలు తెరిచాకే నిర్ధారించగలమన్నారు. డూప్లికేట్ తాళం చెవులు ఇన్నర్ చాంబర్ తాళాలను తెరువలేకపోవడంపై దర్యాప్తు చేస్తామని ఒడిశా ప్రభుత్వం వెల్లడించింది.

భాండాగారంలో మరో రహస్య గది?

రత్న భాండాగారం కింద రహస్య గది ఉన్నదని, సొరంగ మార్గం ద్వారా వెళ్లగలిగే ఆ గదిలో విలువైన సంపద దాచారని కొందరు చరిత్రకారులు చెప్పారు. 1902లో ఆంగ్లేయుల పాలనలో ఈ సొరంగ మార్గం అన్వేషణకు విఫల ప్రయత్నాలు జరిగాయన్నారు. ప్రముఖ చరిత్రకారుడు నరేంద్ర కుమార్ మిశ్రా మాట్లాడుతూ పూరీ రాజు కపిలేంద్ర దేవ్, తర్వాత పురుషోత్తం దేవ్ హయాంలలో పెద్దయెత్తున సంపద సమకూరిందని, దాన్ని భద్రపరిచేందుకు సొరంగ మార్గం నిర్మించారన్నారు. ఇందులో 34 కిరీటాలు, రత్న ఖచిత స్వర్ణ సింహాసనాలు, దేవతల బంగారు విగ్రహాలు ఉన్నాయని వివరించారు.

మళ్లీ టైటానిక్ సాహస యాత్ర

- సముద్రగర్భంలో అన్వేషణకు అమెరికా బృందం
- 'ఓషియన్‌గేట్' ప్రమాదం తర్వాత మొదటిసారి
- టైటానిక్‌పై శాస్త్రీయ అధ్యయనం చేపట్టే ఆలోచన
- హైరిజల్యూషన్ ఫొటోలు తీయాలని ప్రణాళిక

న్యూయార్క్, జూలై 16: టైటానిక్! ఆధునిక మానవజాతి చరిత్ర మరువలేని విషాదం. నీటమునిగి వందేండ్లు గడిచినా ఇప్పటికీ ప్రపంచం నోట్లో నానుతున్న పేరు. ఈ ప్రమాదంపై నేటికీ అంతుచిక్కని ప్రశ్నలెన్నో. వీటికి సమాధానాలు కనుగొనేందుకూ ఇప్పటికీ ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఆర్ఎంఎస్ టైటానిక్ అనే సంస్థ ఈ ప్రయత్నాన్ని కొత్తగా ప్రారంభించబోతున్నది. సముద్రగర్భంలో చిక్కుకున్న టైటానిక్ వద్దకు సాహసయాత్ర చేపట్టనున్నది. టైటానిక్‌కు సంబంధించిన మరింత సమాచారాన్ని రానున్న తరాలకు అందించాలనే లక్ష్యంతో శుక్రవారం టైటానిక్ వద్దకు ఓ బృందం బయలుదేరుతున్నది. గత ఏడాది జూన్ 18న టైటానిక్‌ను చూసేందుకు ఐదుగురు సభ్యుల బృందంతో వెళ్లిన ఓషియన్‌గేట్ టైటాన్ సబ్‌మెర్సిబుల్ ప్రమాదం జరిగిన తర్వాత టైటానిక్ వద్దకు వెళ్లేందుకు జరుగుతున్న మొదటి ప్రయత్నం ఇదే కావడం విశేషం.

టైటానిక్ వద్దకు వెళ్లడమే ఓ సాహసం

ఇంగ్లండ్‌లోని సౌతాంప్టన్ నుంచి అమెరికాలోని న్యూయార్క్‌కు 2,224 మందితో బయల్దేరిన టైటానిక్ నౌక 1912 ఏప్రిల్ 14న ప్రమాదానికి గురయ్యింది. ఓ మంచుకొండను ఢీకొన్న ఈ భారీ నౌక సముద్రగర్భంలో మునిగిపోయింది. దీని జాడ గుర్తించడానికే 73 ఏండ్లు పట్టింది. ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో, కెనెడాలోని న్యూఫౌండ్‌లాండ్ తీరంలో 3,800 అడుగుల లోతులో టైటానిక్ ఉన్నట్టు 1985 సెప్టెంబరు 1న గుర్తించారు. అప్పటినుంచి టైటానిక్‌ను ఒకసారి చూడాలనే ఆసక్తి ప్రపంచవ్యాప్తంగా నెలకొన్నది. ఇప్పటివరకు దాదాపు 250 మంది మాత్రమే టైటానిక్‌ను చూడగలిగారు.



గత ఏడాది విషాదంగా ముగిసిన యాత్ర

టైటానిక్ పట్ల జనంలో ఉన్న ఆసక్తిని గుర్తించిన ఓషియన్‌గేట్ అనే కంపెనీ.. టైటానిక్ యాత్రకు శ్రీకారం చుట్టింది. టైటాన్ అనే సబ్‌మెర్సిబుల్‌లో ఐదుగురిని టైటానిక్ వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించింది. ఇందులో ఒకరు ఆ కంపెనీ యజమాని స్టాక్‌టన్ రష్ కూడా ఉన్నారు. అయితే, ఈ యాత్ర విషాదాంతం అయ్యింది. సముద్రంలో ఇది గల్లంతయ్యింది. చాలా రోజుల పాటు సెర్చ్ ఆపరేషన్ చేసిన తర్వాత 'టైటాన్' పేలిపోయిందని, ఇందులో ఉన్న వారంతా మరణించారని తేలింది. ఈ ప్రమాదం తర్వాత మొదటిసారి ఆర్ఎంఎస్ టైటానిక్ సంస్థ.. టైటానిక్‌పై అధ్యయనం కోసం ఒక బృందాన్ని పంపిస్తున్నట్టు ప్రకటించింది.

టైటానిక్ యాత్రకు ఆరుగురు సభ్యులు

టైటానిక్ శిథిలాలను హైరిజల్యూషన్‌లో ఫొటోలు తీసి టైటానిక్ చరిత్రను భావితరాలకు, శాస్త్రీయ అధ్యయనాలకు అందించాలనేది తమ లక్ష్యమని ఆర్ఎంఎస్ టైటానిక్ సంస్థ ప్రకటించింది. టైటానిక్‌లో ఉన్న పాడైపోతున్న కళాఖండాలను వెలికితీసేందుకు ఉన్న అవకాశాలను గుర్తిస్తామని చెప్తున్నది. టైటానిక్ వద్దకు వెళ్లనున్న బృందంలో ఆరుగురు సభ్యులు ఉండన